# జననీ...జన్మభూమి

– రాపేటి రామకృష్ణారావు

నేను రిటైరై రెండేళ్లకు పైగానే అయింది. లంకంత ఇంట్లో ఇద్దరమే మిగిలాం. సుభద్రకి నిద్ర పట్టినట్టుంది. గురక మొదలైంది. నాకూ నిద్ర పట్ట బోతుండగా ''పోస్ట్'' అన్న కేక, సైకిల్ బెల్ వినిపించి ఉలిక్కిపడి లేచి వీధి లోకి వెళ్లాను. ఏరోగ్రామ్‌ని చూడగానే అబ్బాయి అమెరికా నుంచి రాసిన ఉత్తరమని అర్థమైంది. తను ఉత్తరం రాసి నెలరోజులకుపైగా అయింది. పదిహేను రోజులకీ, నెలకీ ఫోను మాత్రమే చేస్తుంటాడు. ఈమారు వీలు చూసుకుని ఉత్తరం రాసాడని అర్థం చేసుకున్నాను. లెటరు తీసుకుని గబ గబా లోపలకు వెళ్లి మంచం మీద పడుకుని కవరు చించాను.

సుభద్రకి కూడా సైకిల్ బెల్‌వల్లనే మెలకువ వచ్చినట్లుంది. లేచిపోయింది.

''అబ్బాయి రాశాడా? బయటకి చదవండి నేనూ వింటాను'' అంది.

ఉత్తరం బయటకి చదవడం మొదలుపెట్టాను.

కాలిఫోర్నియా
10.9.98.

ప్రియాతి ప్రియమైన తల్లిదండ్రులకి
నమస్కరించి మీ కుమారుడు నందకిశోర్,

మీరు రాసిన ఉత్తరం అందింది. మీ ఆవేదన నాకూ, సుశీలకూ అర్థమైంది. ముసలాళ్లమై పోయాం. మీరాక కోసం ఎదురు చూస్తున్నాం. సంపాదించింది చాలు. ఇంకా ఎంతకాలం, ఈ వృద్ధాప్యంలో మాకు దిక్కెవరు? పిల్లల్ని కన్నదెందుకు? ఇండియా వచ్చేయండి అని మీరు రాస్తున్నారు. ఆనాడు ఏవో నాలుగు రాళ్ళు సంపాదించి ఇండియా వచ్చేయ్యాలనే అనుకున్నాను. నిజమే. కానీ ఇప్పటి పరిస్థితులు వేరు. ఇక్కడి నుంచి ప్రస్తుతం కదిలే స్థితిలో లేము. గ్రీన్‌కార్డ్ ఎప్పుడో వచ్చేసింది. అమెరికన్లుగా మారిపోయాం. ప్రవాస భారతీయులమై పోయాం. ఇల్లూ, కారూ, ఆస్తులూ సంపాదించాం. పిల్లలు ఇక్కడి వేగానికి అలవాటు పడిపోయారు. ఇండియా ఎందుకు వెళ్లాలి? బామ్మనీ, తాతయ్యనీ ఇక్కడికే పిలిపించండి అంటున్నారు. ఇక్కడ ముసలాళ్లెవరూ పిల్లలమీద ఆధారపడరు. హోమ్ ఫర్ ది ఏజ్‌డ్ అనే ముసలాళ్ళ ఆవాస గృహాలుంటాయి. అందులో అన్ని సదుపాయాలుంటాయి. ముసలికాలంలో మా గతేమిటి, మమ్మల్నెవరు చూస్తారు అని అనుకోరు. అయినా మీకా ఖర్మ పట్టదు. మన ఊళ్ళో అక్క వుంది. తాతయ్య, నాన్నమ్మ అక్కడ బ్రతకడం లేదా? భయపడకండి. మీరు నా దగ్గరకు వచ్చేస్తానంటే ఆ ఏర్పాట్లు చేస్తాను. పాస్‌పోర్టులు మీకెలాగూ వున్నాయి. వీసాలు, టిక్కెట్లు పంపించమంటే పంపిస్తాను. ఇక్కడికి వచ్చేయండి. లేదా మీకు కావాల్సినంత డబ్బు పంపుతూ వుంటాను. మీ ఆరోగ్యాలు జాగ్రత్త. అమ్మా, మీరు రెగ్యులర్‌గా మెడికల్ చెకప్‌లు చేసుకుంటూ వుండండి. ఈ సంవత్సరమైనా మేము రావడానికి కుదిరేలా లేదు. వెంటనే సమాధానం రాయండి.

ఇట్లు మీ కుమారుడు
నందకిశోర్

ఉత్తరం చదువుతుంటే నా హృదయం బరువెక్కింది. నా ఫీలింగ్స్ వ్యక్తం చేస్తే మా ఆవిడ ఏడుపందుకుంటుంది. అందుకనే ఏమీ అనలేదు. ఆ ఉత్తరంలోనే మా కోడలు సుశీల రాసిన ఉత్తరం వుంది. గేప్ ఇవ్వకుండా ఆ ఉత్తరం చదవడం మొదలుపెట్టాను.

అయినా సుభద్ర వ్యాఖ్యానం మొదలుపెట్టింది.

''వీడు కొడుకు కాడండీ. వీడికి మనమీద ప్రేమ లేదండీ. అమెరికాలో తల్లిదండ్రుల్ని వదిలేస్తే వీడూ వదిలేస్తాడా? అలాగ రాయడానికి చేతులెలా వచ్చాయి?'' అంది.

ఆపకపోతే సాయంత్రందాకా వాగుతూనే వుంటుంది అనుకుని ''సరేలే కోడలు ఉత్తరం విను. అప్పుడు మాట్లాడుదువుగానీ'' అని చదవడం మొదలుపెట్టాడు.

మహారాజశ్రీ మామయ్యగారికి, అత్తయ్యగారికి నమస్కరించి కోడలు సుశీల వ్రాయునది. ఇక్కడ మేమందరం క్షేమం. మీ మనవడు విశ్వభరత్, మనవరాలు శారద బాగానే చదువుకుంటున్నారు. మీ ఉత్తరం చదివాం. నాకు మాత్రం ఇండియాకు వచ్చేయాలనే వుంది. కానీ పిల్లలు, మీ అబ్బాయి కూడా వద్దనే అంటున్నారు.

ఇక్కడ హాయిగానే గడిచిపోతున్నది. ఇండియావెళ్లి మళ్లీ కొత్త జీవితం మొదలుపెట్టాలి. ఎందుకొచ్చిన రిస్క్ అంటున్నారు. ఇలా రాస్తున్నందుకు మీరు బాధ పడనంటే ఒక మాట. జీవితంలో తరాలు మారుతున్న కొద్దీ ఆలోచనల్లో మార్పులు రావడం సహజం. ఉదాహరణకు మామయ్యగారేం చేశారు? విశాఖపట్నం జిల్లాలోని మన వూరుని మరచిపోయారు. అక్కడ మన భూములని అమ్మేసారు. హైదరాబాద్‌లో మనకి ఇల్లు, ఆస్తి ఏర్పరిచారు. రిటైరైన తరువాత కూడా ఇంకా హైదరాబాద్‌లోనే ఎందుకుంటున్నారు? ఏడాదికోమారు ముసలి తల్లిదండ్రుల్ని చూడడానికి కూడా వెళ్లడంలేదు. తన బాధ్యతని కూతురికి అప్పగించి ఎకరం భూమిమీది ఆదాయంతో వాళ్లని బ్రతకమని వదిలేసారు. అది మీకు తప్పనిపించడంలేదు. వీళ్లకి ఇది తప్పనిపించడంలేదు. అదే తరాలలో వచ్చే మార్పు. మారుతున్న కాలంతో మనమూ మారాలి. మిమ్మల్ని చూడాలని వుంది, ఇండియా రావాలని వుంది. కానీ ఎలా రావడం? వెళదామంటే ఈయన వినరు. 'అబ్బా! అంత డబ్బూ, కాలం వృథాచేసి ఎందుకు వెళ్లడం? ఫోనులో వీలున్నప్పుడు మాట్లాడుతూనే వున్నాంకదా' అంటారు. నేనేం చేయను. ఎలాగో వీలు చూసుకుని వీళ్లని ఒప్పించి వచ్చే ఏడాది తప్పకుండా వస్తాం. అందర్నీ అడిగినట్లు చెప్పండి.

మీ కోడలు
సుశీల

ఉత్తరం ముగించి మా ఆవిడవైపు చూసాను. అప్పటికే ఆవిడ ఏడుస్తోంది. కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ ''వీళ్ళు రారండీ. మనం పోయిన తరువాతైనా వస్తారనే నమ్మకంలేదు. అప్పుడిక వస్తే మాత్రం ఎందుకు?'' అంటూ భోరున ఏడుపు అందుకుంది.

నాకూ చాలా బాధగానే వుంది. కానీ ఏడవలేను కదా. సుభద్ర ఏడ్చి తన హృదయభారం తగ్గించుకుంది. తానెవ్వరికి చెప్పుకుంటాడు? వృద్ధాప్యంలో పిల్లల వియోగం ఇంత బాధాకరంగా **వుంటుందా?** తన దాకావస్తేగానీ మనిషి ఏదీ తెలుసుకోలేడు. తల్లి



దం(డులు
జ్ఞాపకం వచ్చారు. కోడలు సుశీల చెప్పింది నిజమే. ఆలోచనలు పదిహేనేళ్ళ గతంలోకి వెళ్లిపోయాయి.

• • •

ఆ రోజుల్లో తనకి డబ్బెంతో అవసరం. ఊళ్ళో వున్న భూములన్నీ చాలావరకూ అమ్మేశాను. చిక్కడపల్లిలో పాత ఇల్లు కొని రీమోడల్ చేయించాను. కొడుకు తెలివైనవాడు. ఎలక్ట్రానిక్స్‌లో బిటెక్ పాసయ్యాడు. చాలా మంచి మార్కులొచ్చాయి. టోఫెల్ పాసయ్యాడు. జిఆర్ఈలో కూడా మంచి రేంకు వచ్చింది. అమెరికాలోని క్లేవ్‌లేండులోని యూనివర్శిటీలో పోస్టుగ్రాడ్యుయేషన్‌కి సీటు దొరికింది. అమెరికా వెళ్లడానికి రెండులక్షలకి పైగా అవసరం అయింది. ఊరెళ్లాను. నాన్న, అమ్మ మిగిలిన మూడెకరాలూ అమ్మడానికి ఒప్పుకున్నారు కాదు.

''ఇదేనా
వుంచరా బాబూ! ఏ చెట్టుపిట్ట ఆ చెట్టుని చేరుకోవాలి. కన్నతల్లినీ, పుట్టిన ఊరునీ మరచిపోలేము. నువ్వు రిటైరై మళ్లీ మన వూళ్ళో హాయిగా వుండవచ్చును'' అన్నారు. తను వాళ్ళ మాటలు వినలేదు.

''ఏమిటీ నాన్నా! బాబుని అమెరికా పంపడం ముఖ్యం నాకు. ఈ ఊళ్ళో భూముల్లేకపోయినా ఫర్వాలేదు. కావాలంటే మళ్ళీ కొనుక్కోలేమా? వాడే కొనుక్కుంటాడు'' అనేసి వాళ్ళ మాటలు వినకుండా మరో రెండు ఎకరాలు అమ్మేసాడు. ఇంక ఒక్క ఎకరం నేల, ఓ పెంకుటిల్లు మాత్రం మిగిలి వుంది. ఆ ఎకరంమీద వచ్చే ఆదాయంతో ఊళ్ళో సంబంధం చేసిన పెద్దమ్మాయి వాళ్ళని చూస్తున్నది. నాన్నకి కోపం తెప్పించాడు. ఆ కోపంతో హైదరాబాద్ రావడమే మానేశాడు. ఒకేసారి అదీ నందకిశోర్ పెళ్ళికి వచ్చి వెంటనే వెళ్లిపోయాడు. తాను మాత్రం ఏం న్యాయం చేసాడు? తల్లిదండ్రులకి ద్రోహం చేయలేదా? వెళ్లిన ప్రతిసారీ అమ్మనీ నాన్ననీ రమ్మంటాడు. కానీ ఊరువదిలి రాలేంరా అంటారు. హైదరాబాద్‌లోని ఇల్లు, పరిసరాలు, స్నేహితుల్ని వదిలి తనూ వెళ్ళలేకపోయాడు.

• • •

''ఏమిటండీ ఏడుస్తున్నారా?'' అన్న సుభద్ర మాటలు విని స్పృహలోకి వచ్చాను. కళ్ళు తుడుచుకున్నాను.

''ఎలాగండీ? ఇప్పుడేం చేద్దాం? ఈ ఇల్లు, ఆస్తీ ఎవరికోసం?'' మొదలెట్టింది.

నాకు మాత్రం ఏం తెలుసును చెప్పండి. బాగా చదువుకుని విదేశాలకి వెళ్లాడని చెప్పుకోవడానికి బాగానే వుంది. ఇంతకాలం అందరితోనూ అవకాశం దొరికితే చాలు మావాడు ఎంత తెలివైనవాడో, ఎంత కష్టపడి చదివించాడో, అమెరికాలో ఏం చేస్తున్నాడో మొదలైన విషయాలన్నీ అడిగినవీ, అడగనివీ చెప్పేవాడు. సంపాదించిందిక చాల్లేరా అని వచ్చెయ్యమంటున్నాను. వచ్చే ఏడాదికి వచ్చేస్తున్నాడు దాకా ఏకరువు పెట్టేవాడు. ఇప్పుడింకేం చెప్పడం.

తను వాడిని విదేశాలకి పంపడమే తప్పయింది. విదేశాల జీవన విధానాలకి అలవాటుపడి ఇక రావడమే మానేస్తారని ఎవరైనా అనుకోగలరా? అయినా బంగారంలాంటి భారతదేశాన్ని వదిలేసి విదేశాలలో ఎవరైనా సెటిలవుతారని ఊహించగలమా? ఇక్కడున్నంత నిజమైన స్వాతంత్ర్యం మరే దేశంలోనైనా వుందా? ఇక్కడ శరీరానికి అనువైన ఉష్ణోగ్రత, వాతావరణం ఆ చలి దేశాలలో కృత్రిమ ఉష్ణోగ్రతలో ఎందుకు బ్రతకడం అనిపించింది. నాలుగు నెలలు వుండకలేక మూడునె



## అదృష్టం

''అదృష్టం బాగుండి నేను రాజకీయాల నుండి విరమించుకున్నాను.'' అన్నాడో రాజకీయ నాయకుడు.

''ఎవరి అదృష్టం బావుండి సార్..'' అడిగాడు విలేకరి.

## ఉత్తరం ముక్క

''అదేమిట్రా భడవా! ఉత్తరాన్ని సగానికి చింపి మరీ వ్రాస్తున్నావ్?'' అడిగింది బామ్మ.

''నువ్వే చెప్పావుగా బామ్మా! తాతగారికి ఓ ఉత్తరం ముక్క వ్రాసి పడేయమన్నావ్గా.'' వివరించాడు బబ్లూ.

## కష్టం!

''గాలి పీలుస్తుంటే చాలా కష్టంగా వుంటోంది డాక్టరుగారూ!'' చెప్పాడు బాధగా పేషెంట్.


''అంత కష్టంగా వుంటే ఎవడోయ్ నిన్ను గాలి పీల్చమన్నది. కష్టంగా వుండే పనులన్నీ మానెయ్యమని ఎన్నిసార్లు చెప్పాలి.'' కసురుకున్నాడు డాక్టర్ కామేష్.

## వాటా!

''నన్ను వదిలెయ్యండి సార్. సగం వాటా ఇచ్చుకుంటాను.'' బ్రతిమాలాడు దొంగ.

''వాటాలేదు, గీటాలేదు. మొత్తం ఇక్కడ పెట్టి వెళ్ళిపో.'' ఖచ్చితంగా చెప్పాడు యస్.ఐ.

- పి.వి.రమణకుమార్ (చిలకలూరిపేట)




లల్లోనే సుభద్రా తానూ కూడబలుక్కుని వచ్చేశారు. మళ్లీ జన్మలో వెళ్ళకూడదనుకున్నారు. తాము వెళ్లినప్పుడు న్యూయార్క్‌లో ఎయిర్‌పోర్ట్‌లో దిగలేకపోయారు. మూడు నాలుగడుగుల మంచు రోడ్లమీద కురిసింది. నందకిశోర్ ఎయిర్‌పోర్ట్‌కి వచ్చి కారులో తీసుకెళ్లాడు.

''ఎలాగరా బతుకుతున్నారిక్కడ?'' అనడిగాను.

''కాలిఫోర్నియాలో బాగానే వుంటుంది నాన్నా. అదేమిటో మీరొచ్చినప్పుడే ఈ మంచు తుఫాను వచ్చింది. మామూలుగా ఇంత మంచు కురవదు'' అని చెప్పాడు.

''ఏమిటండీ ఆలోచిస్తున్నారు? రాకపోతే పోనీయండి. కాలూ చెయ్యి ఆడినంతకాలం ఇలాగే వుందాం. తరువాత ఆ దేవుడే వున్నాడు'' అంది.

''సుభద్రా! నేనొక నిర్ణయానికి వచ్చేసాను'' అన్నాడు.

''చెప్పండి.''

''మనం మన ఇల్లు వీరభద్రరావుకి అద్దెకిచ్చేద్దాం. మన సామాను ఒక గదిలో పెట్టి తాళం వేసుకుని మన వూరెళ్లిపోదాం'' అన్నాను.

''ఏ వీరభద్రరావు? మొన్న మన ఇంట్లో ఒక పోర్షన్ అద్దెకివ్వమని అడిగాడు. అతనేనా?'' అడిగింది.

''ఆ వాడికే. నెలనెలా నా అకౌంట్‌లో అద్దె జమ చేస్తూ వుంటాడు. నా పెన్షను కూడా నెలనెలా జమ అవుతుంది. మూడు నెలలకీ, ఆర్నెల్లకీ వచ్చిపోతూ వుందాం. బయట వరండాని ఆనుకుని వున్న గది మనకి సరిపోతుంది. బయట బాత్రూమ్ వాడుకోవచ్చును. ఓ వారంరోజులున్నా మనకి ఇబ్బంది వుండదు'' అన్నాను.

''నలభై ఏళ్ళయింది మనం ఈ హైదరాబాద్‌కు వచ్చి. ఇక్కడ వాతావరణం బాగా అలవాటైంది. మన ఊళ్లో వుండగలమంటారా?'' బెంగగా అంది.

''ఉండి తీరాలి. కోడలు ఏమి రాసింది. మీరు మన ఊరికి ఎందుకని రిటైరైనా వెళ్లడంలేదు. అలాగే మేమూ అమెరికా నుంచి రాలేకపోతున్నాం అని రాసింది చూసావా. అయినా మన వూరికేమే. పచ్చని పొలాలు, తూర్పు కనుమల మీద నుంచి చల్లని పిల్ల గాలి, విశాఖపట్నం దూరదర్శన్ మాత్రమే కాకుండా మన ఊళ్ళో కూడా డిష్ ఏంటెన్నా టీవీ ఛానెల్స్ అన్నీ వస్తున్నాయి. నా పెన్షన్‌లో సగం ఖర్చు పెడితే లేనిది లేదు'' చెప్పాను.

''అవునండీ. ఆ మాట నిజమే. మనం వెళ్లిపోతే మామయ్యకి మన మీద కోపం పోతుంది. వృద్ధాప్యంలో వాళ్ల సేవ చేస్తే పుణ్యం పురుషార్థం. అమ్మాయి ఉష సంతోషిస్తుంది. మామయ్య ఇక్కడికి రావడంలేదు. ఈ వాతావరణం వాళ్లకి పడదు. మనం అలాగే చేద్దాం'' అన్నది.

అంతే నా లెటర్‌పాడ్ క్లిప్‌కి వున్న ఏరోగ్రామ్ తీసుకున్నాను. అమెరికాకి ఉత్తరం మొదలుపెట్టాను.

హైదరాబాద్
25.9.99

చి.నందకిశోర్‌ని, చి.సౌ.సుశీలని ఆశీర్వదించి మామయ్య మాధవరావు వ్రాయునది. మీ ఉత్తరం ఈ రోజే అందింది. మీరు ఇండియా రావడం కుదరదని కుండ బద్దలు కొట్టినట్టు రాసేసారు. కోడలు సుశీల మారుతున్న తరాలు...మనమూ మారక తప్పదు, మీరు మాత్రం మారిపోలేదా. రిటైరై కూడా మన వూరెందుకు వెళ్లలేదు అని రాసి నా కళ్ళు తెరిపించింది. నిజమే కోడలు రాసిన దాంట్లో నిజం వుంది. మా తప్పు మేము తెలుసుకున్నాము. సుభద్ర కూడా మన వూరు వెళ్లడానికి ఒప్పుకుంది. మీరొచ్చేస్తారు. అమెరికానుంచి వచ్చి హైదరాబాదులో ఏదో నీ స్థాయికి తగ్గ ఉద్యోగం చూసుకుంటావు. నీ నీడన ఇక్కడే మనవడు, మనవరాలితో కాలక్షేపం చేయవచ్చును అని ఆశపడ్డాం. జీవితం మూడుపూలు ఆరు కాయలుగా వుంటుందని కలలుకన్నాం. కానీ ఏం చేస్తాం? చేసుకున్నవాడికి చేసుకున్నంత మహదేవా. కడుపులో లేనిది కావులించుకున్నా రాదు. మేము మరో వారంరోజుల్లో మన వూరు వెళ్లిపోతున్నాం. ఇక్కడి ఇల్లు అద్దెకి ఇచ్చేస్తున్నాం. మన వూరెళ్ళాక తాతయ్య నానమ్మల సేవ చేసుకుని బ్రతుకుతాం. ఇక మీది నుంచి మన మధ్య ఫోన్లో మాటలుండవు కనుక మన వూరికే ఉత్తరాలు రాస్తూ వుండండి.

ఇట్లు
మాధవరావు

సుభద్రకి ఉత్తరం చదివి వినిపించాను.

''ఇంకా చాలా ఖాళీ వుంది. నువ్వేమైనా రాస్తావా?'' అనడిగాను.

''వద్దండీ. బాగానే రాసారు. పోస్టు చేసేయండి'' చెప్పేసింది. సుభద్ర ముఖంలో ఏదో తెలియని రిలీఫ్ కనిపించింది. నాలో కూడా ఏదో తెలియని ఆనందం, తుపాను తరువాత వచ్చే ప్రశాంతత, మొయ్యలేని బరువు మోస్తూ గమ్యం చేరగానే బరువు దించిన తరువాత కలిగే హాయి. మనసు గతంలోకి పరుగులు. చిన్ననాటి జ్ఞాపకాలు, రామాలయం, అక్కడి వేప చెట్టు, గలగలపారే కొండవాగులు... మనసు పాతరని తవ్వితే బయటకుబుకుతున్నాయి. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి అని ఊరికే అన్నారా.

అదే రోజు ఉత్తరం పోస్టు చేసేసాను. మరో వారంరోజుల్లో ఇల్లు అద్దెకిచ్చెయడం, గోదావరికి రిజర్వేషన్, ఊరెళ్లిపోవడానికి ముహూర్తం అన్నీ జరిగిపోయాయి.

★